WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం
# స్వర్ణసాగరం
PRGI: APTEL/26/A2367
జాతీయ తెలుగు దినపత్రిక
www.swarnasagaram.com
ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 1 | సంచిక : 162 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | శనివారం 22 ఆగస్టు 2026 | వెల : 2-00



## జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

- కుల ఆధారిత రిజర్వేషన్లకు వ్యతిరేకంగా భారీ నిరసనలు
- రంగంలోకి పోలీసులు, కేంద్ర బలగాలు!
- దిల్లీ జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన ఆందోళనకారులు
- కుల ప్రాతిపదికన రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నిరసనలు
- ముందస్తు చర్యగా పోలీసు, పారమిలిటరీ దళాల భారీ మోహరింపు

2



## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..

- కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా సమీక్ష
- జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై నడ్డా సమీక్ష
- నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలను సమీక్షించిన నడ్డా
- వ్యాధి లక్షణాలున్నవారిని ముందస్తుగా గుర్తించడం కీలకమన్న కేంద్ర మంత్రి

# ఏపీ మున్సిపాలిటీల సమూల ప్రక్షాళన



### రూ.40 వేల కోట్లతో బృహత్తర ప్రణాళిక

### 123 పట్టణ స్థానిక సంస్థల్లో రూ.40,743 కోట్లతో భారీ ప్రాజెక్టులు

### రోడ్లు, డ్రైనేజీల కోసం రూ.7,469 కోట్లకు పరిపాలనా అనుమతులు

### పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు

**అమరావతి, స్వర్ణసాగరం**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు ప్రభుత్వం బృహత్తర ప్రణాళికలు సిద్ధం చేసింది. స్వర్ణాంధ్ర-2047కు అనుగుణంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఏకంగా రూ.40,743 కోట్ల అంచనాతో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, వీధిదీపాల ఏర్పాటు కోసం రూ.7,469.46 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ పురపాలక శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ముందుకెళ్తోంది. మంజూరైన రూ.7,469.46 కోట్లలో రూ.5,500 కోట్లు మూలధన పనులకు, మిగతా రూ.1,969.46 కోట్లు పదేళ్ల వడ్డీ చెల్లింపుల కోసం కేటాయించారు. ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 4,388 కి.మీ మేర రోడ్ల నిర్మాణం, 541 పార్కులు, 1,186 కి.మీ సెంట్రల్ మీడియన్లు, 20,340 వీధి దీపాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం అంటే రూ.2,200 కోట్లు, ప్రభుత్వం ఎల్ఆర్ఎస్/బీపీఎస్ నిధుల ద్వారా ముందుగా చెల్లిస్తుంది. మిగతా 60 శాతం అంటే రూ.3,300 కోట్లు గుత్తేదారు సంస్థ భరిస్తుంది. పనులు పూర్తయిన తర్వాత పదేళ్ల పాటు నిర్వహణ బాధ్యత కూడా ఆ సంస్థదే. ఎస్క్రో ఖాతా ద్వారా 40 త్రైమాసిక వాయిదాల్లో ప్రభుత్వం వారికి నిధులు చెల్లిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లో మౌలిక వసతుల లేమిపై ప్రభుత్వం శాస్త్రీయంగా గ్యాప్ అసెస్‌మెంట్ నిర్వహించింది. అమృత్ 2.0, ఏఐఐబీ, - మిగతా3లో

# రంగంలోకి ఈడీ

- మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తింపు.. కేసు నమోదు
- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి సహా నిందితుల నివాసాల్లో సోదాలు
- పులివెందుల, హైదరాబాద్‌ల్లోని 7 చోట్ల ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు
- కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం
- అవినాష్‌రెడ్డి ఇంట్లో లెక్కల్లో చూపని రూ.24 లక్షలు



**స్వర్ణసాగరం అమరావతి, హైదరాబాద్, కడప**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ హత్య కోసం రూ.40 కోట్లు సుపారీ చెల్లించేలా ఒప్పందం చేసుకుని.. నిందితుడు షేక్ దస్తగిరి (అప్రూవర్‌గా మారారు)కి అడ్వాన్స్ కింద రూ. కోటి ఇచ్చారంటూ సీబీఐ తేల్చిన నేపథ్యంలో ఈ ఆర్థిక లావాదేవీలపై ఈడీ దృష్టి సారించింది. దీని వెనక పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగినట్లు గుర్తించింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా - మిగతా3లో



## పని.. ప్రాథమిక హక్కు అవుతుందా?

- కనీస వేతనాలపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రశ్న
- ఆర్టికల్ 21తో పని హక్కును సమానం చేయలేమని స్పష్టీకరణ
- తాజా గణాంకాలతో మళ్లీ పిటిషన్ వేయాలని సూచన

2లో



# కబళిస్తోన్న క్యాన్సర్!

- జాతీయ సగటు కంటే ఏపీలోనే భారీ పెరుగుదల
- ఐదేళ్లలో 39.5 శాతం పెరిగిన కేసులు.. దేశంలో 12.8 శాతమే
- ఏటా 76 వేలకుపైగా కొత్త కేసులు.. 40 వేలకుపైగా మరణాలు
- 4.73 లక్షల మంది చికిత్సలో.. 40-69 ఏళ్ల వారే 70 శాతం
- స్క్రీనింగ్‌లో అనుమానితులుగా తేలినా 88.2 శాతం మంది తదుపరి పరీక్షలకు దూరం
- గుంటూరు, విశాఖ, కర్నూలు, కడపలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలు

**అమరావతి, స్వర్ణసాగరం**

ఆంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ కేసుల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. గత ఐదేళ్లలో రాష్ట్రంలో కొత్తగా నమోదవుతున్న క్యాన్సర్ కేసులు ఏకంగా 39.5 శాతం పెరగగా, ఇదే కాలంలో దేశవ్యాప్తంగా కేసుల పెరుగుదల 12.8 శాతానికే పరిమితమైంది. రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 4.73 లక్షల మంది క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఏటా 76 వేలకుపైగా కొత్త కేసులు వెలుగులోకి వస్తుండగా, క్యాన్సర్ కారణంగా 40 వేల మందికిపైగా మరణిస్తున్నట్లు - మిగతా2లో



స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు



అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపెనీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారగలదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నారు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు. యువ అంతరిక్ష పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం, ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష సాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులను కోరారు. స్పేస్ స్టార్టప్‌ల వంటి కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి రిస్కులు తీసుకున్నందుకు వారిని ప్రశంసించారు. సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని పిలుపునిచ్చారు. "ప్రపంచం అంతరిక్షం గురించి ఆలోచించినప్పుడు భారత్ వైపు చూసే ఒక ఎకో సిస్టమ్‌ను సృష్టించాలి. ప్రపంచవ్యాప్త ప్రతిభను, కంపెనీలను, పెట్టుబడులను ఆకర్షించడానికి దేశ అంతరిక్ష రంగం ఒక అయస్కాంతంలా పనిచేయగలదు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం కల్పించడం పట్ల ప్రభుత్వానికి దార్శనికత ఉంది. ఒక కొత్త రంగాన్ని ముందుండి నడిపించినందుకు స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, ఫౌండర్స్‌కు అభినందనలు. అనేక దేశాలు అంతరిక్ష రంగంలో పెట్టుబడులు పెట్టలేకపోతున్నాయి. కొన్ని దేశాలు ఇన్వెస్ట్ చేయడానికి ఇష్టపడటం లేదు. ఇది ప్రపంచ అంతరిక్ష రంగంలో భారతదేశానికి తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది. చిన్న వయసు నుంచే పిల్లలలో అంతరిక్షం పట్ల జిజ్ఞాస, ఆసక్తిని పెంపొందించడానికి అంతరిక్ష సంస్థలు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మధ్య మరింత సన్నిహిత సహకారం ఉండాలి. "

భారత అంతరిక్ష రంగ యువ కెరటాలను కలవడం అద్భుతంగా ఉందన్నారు మోదీ. "ఒక కొత్త, సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించిన యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు వీరు. వారు రిస్కులు తీసుకున్నారు, సంస్కరణల ప్రక్రియను విశ్వసించారు. తమ ప్రయత్నాలలో నిలకడగా ఉన్నారు. దీని కారణంగా గత కొన్నేళ్లుగా అంతరిక్ష రంగంలో భారత్ ఎంతో సాధించింది. స్టార్టప్‌లు తమ పనిపై విశ్లేషణాత్మక ప్రజెంటేషన్లు ఇచ్చాయి. భవిష్యత్ కోసం దేశ సామర్థ్యాలను నిర్మించే క్రమంలో భారత ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని స్పేస్ స్టార్టప్‌లకు హామీ ఇచ్చాను. అంతరిక్ష రంగంలో భారత్ ప్రపంచానికి ఒక బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన నమూనాను అందించగలదు" అని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో దిగిన ఫొటోను మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**సీఈఓలు, ఫౌండర్స్ ఏమన్నారంటే?**

భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ వేగంగా సాధిస్తున్న ప్రగతిని స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు మోదీ వద్ద ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ అంతరిక్ష రంగం అభివృద్ధి చేసిన సాంకేతికతలను స్వీకరించడానికి, వినియోగించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించడం ఈ పరిశ్రమకు కొత్త అవకాశాలను సృష్టించిందని పేర్కొన్నారు. ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమకు ప్రభుత్వం నుంచి లభించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్స్‌ఐ, పియర్‌సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, సాట్‌స్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రోబేస్, టేక్‌మీ2స్పేస్, వ్యోమిక్, కాస్మోసర్వ్ స్పేస్, ఆర్బిట్‌ఎయిడ్ ఏరోస్పేస్, స్పైసర్వ్, సెరెండిపిటీ స్పేస్, వాసర్ ల్యాబ్స్, మిస్ట్‌ఈఓ సంస్థల సీఈఓలు, వ్యవస్థాపకులు ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వారితో దేశ అంతరిక్ష రంగం గురించి మోదీ సంభాషించారు.

# జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత



దేశ రాజధాని దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరోసారి తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ప్రస్తుత కుల ఆధారిత రిజర్వేషన్ల విధానానికి వ్యతిరేకంగా పెద్ద సంఖ్యలో ప్రజలు, యువకులు జంతర్ మంతర్ వద్దకు చేరుకొని నిరసనలు తెలిపారు. రిజర్వేషన్ వ్యవస్థను సమీక్షించాలని, రిజర్వేషన్లలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆందోళన కార్యక్రమానికి ఎలాంటి ముందస్తు అనుమతులు లేవని పోలీసులు స్పష్టం చేసినప్పటికీ, పెద్ద ఎత్తున నిరసనకారులు భారీగా తరలివచ్చారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా, శాంతి భద్రతల్ని కాపాడేందుకు దిల్లీ పోలీసులు, కేంద్ర పారామిలిటరీ బలగాలు నిరసన ప్రాంతానికి చేరుకొని భద్రతను పర్యవేక్షించాయి. ఈ నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరిస్తూ దిల్లీ పోలీసులు గురువారమే ప్రకటన విడుదల చేశారు. అయినప్పటికీ శుక్రవారం ఉదయం నుంచే చిన్న చిన్న గుంపులుగా ప్రజలు జంతర్ మంతర్ వద్దకు చేరుకోవడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే పరిస్థితి చేయిదాటిపోకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యగా పోలీసులు జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం జరగడం వల్లే నిరసనకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చినట్లు తెలుస్తోంది. దాదాపు 5.6 మిలియన్ల ఫాలోవర్లు ఉన్న ఒక సంస్థకు చెందిన అధికారిక పేజీ ఇన్‌స్టాగ్రామ్‌లో గురువారం రోజు ఒక పోస్టర్‌ను పంచుకుంది. ఆగస్ట్ 21న మధ్యాహ్నం 2 గంటలకు జంతర్ మంతర్ వద్ద జరిగే శాంతియుత నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' (=వంవతీజఖ్ఆశీఅ ఝఖ్షీ చాఅసశీశ్రీఖఅ) అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా ఈ నిరసనకు పిలుపునిచ్చినట్లు తెలిసింది. ఈ పోస్ట్ బాగా వైరల్ కావడంతో ఉదయం నుంచే జనం గుంపులు గుంపులుగా జంతర్ మంతర్ దగ్గరికి రావడం ప్రారంభించారు. ఇటీవల 'కాక్రోచ్ జనతా పార్టీ' నిరసన విధానాల్ని అనుసరిస్తూనే ఈ వేదిక కూడా వేగంగా ప్రసిద్ధి చెందింది. ఈ పేజీ ద్వారానే రిజర్వేషన్ వ్యవస్థకు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపునివ్వడంతో, పోలీసులు అప్రమత్తమై జంతర్ మంతర్ వద్ద భద్రతను పటిష్టం చేశారు.

**సోషల్ మీడియా ప్రచారంపై పోలీసుల తీవ్ర హెచ్చరికలు**

ఆగస్ట్ 21న జంతర్ మంతర్ వద్ద రిజర్వేషన్ల సంస్కరణలపై నిరసన తెలిపేందుకు అనుమతి లభించిందంటూ సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న వార్తలు, వీడియోలు అబద్ధమని, తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని దిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. దిల్లీ జిల్లా పరిధిలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితలోని (దీచీూా) సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144 జతీూజ) ప్రకారం నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం, నిరసన ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు నిర్వహించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఇదే సమయంలో ఫేక్ న్యూస్‌ను, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయడం, ప్రచారం చేయడం లేదా నమ్మడం చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫేక్ న్యూస్ సృష్టించే వారిపై లేదా దాన్ని వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నిరసనలకు కేంద్రంగా జంతర్ మంతర్!**

దిల్లీ జంతర్ మంతర్ ఇటీవల ఎక్కువగా వార్తల్లో నిలిచింది. నీట్- యూజీ పేపర్ లీకేజీ ఆరోపణలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) ఇక్కడే నిరసనల్ని ప్రారంభించింది. విద్యార్థుల పోరాటానికి లద్దాఖ్‌కు చెందిన ఇంజినీర్, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్ చుక్ జంతర్ మంతర్ వద్ద జూన్ 28న ఆమరణ నిరాహార దీక్ష కూడా చేపట్టారు. అక్కడి నుంచే జులై 20న చేపట్టిన పార్లమెంట్ మార్చ్ ఉద్రిక్తతలకు దారితీసింది. ప్రభుత్వం ఆ తర్వాత లిఖితపూర్వక హామీలివ్వడంతో జులై 23న వాంగ్‌చుక్ దీక్ష విరమించారు. తర్వాత జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ కూడా రాజీనామా చేశారు. ఆ తర్వాతే జంతర్ మంతర్ వద్ద చాలా రోజుల తర్వాత జనసందోహం తగ్గింది. మళ్లీ ఇప్పుడు అక్కడికి భారీగా ప్రజలు తరలిరావడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

# సిద్ధాంతాల ఆధారంగానే పదవులు

**న్యూఢిల్లీ :** భారత రాజకీయాల్లో వారసత్వం, కుటుంబ నేపథ్యం అనేది నాయకత్వ అర్హతగా మారిన తరుణంలో, భారతీయ జనతా పార్టీ మాత్రం కింది స్థాయి కార్యకర్త నుంచి అగ్ర నాయకుడిగా ఎదిగే సిద్ధాంతానికే మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రకటించిన పార్టీ కొత్త జాతీయ కార్యవర్గంలో సైతం ఈ తరహా క్యాడర్-బేస్డ్ లీడర్‌షిప్‌కే అధిష్ఠానం పెద్దపీట వేసింది. కేవలం ఒక పొలిటికల్ ప్యాషన్ , క్రమశిక్షణ, భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా నంబర్-1 స్థానాన్ని అధిష్టించే అవకాశం కల్పించడమే తమ శ్రేణుల బలం అని బీజేపీ మరోసారి రుజువు చేసింది. ఈ గ్రాస్‌రూట్ మోడల్ కు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే అతిపెద్ద ఉదాహరణ. గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, సాదాసీదా కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగిన విధానం బీజేపీ సిద్ధాంతానికి నిలువెత్తు సాక్ష్యం. తాజాగా పార్టీ అత్యున్నత అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన నితిన్ నబీన్ ప్రయాణం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. యువజన మోర్చా స్థాయి నుంచి సుదీర్ఘకాలం పాటు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి, కష్టపడి పనిచేసిన నైపుణ్యాన్ని గుర్తించే పార్టీ జాతీయ నాయకత్వ పగ్గాలను ఆయనకు అప్పగించింది. కొత్త జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామ్ మాధవ్ , ఆల్ సెల్స్ కో కన్వీనర్‌గా స్థానం పొందిన విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల ప్రయాణం ఆర్ఎస్ఎస్, ఏబీవీపీల పునాదుల మీదే సాగింది. రామ్ మాధవ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో క్షేత్రస్థాయి స్వయంసేవక్‌గా పొలిటికల్ డిప్లొమసీని, సిద్ధాంత పటిష్టతను నేర్చుకుని బీజేపీ జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారారు. అలాగే ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. ఇవి కేవలం ఉద్యోగ బాధ్యతలు కావు, సిద్ధాంతం పట్ల ఉండే 'ప్యాషన్'. అధికార మార్పిడి , పదవుల పంపకంలో వారసత్వ రాజకీయాల ను పూర్తిగా పక్కనపెట్టడం బీజేపీకి సంస్థాగతంగా కొన్ని ప్రధాన ప్రయోజనాలను తెచ్చిపెడుతోంది. ఏ మూలన ఉన్న సాధారణ శ్రేణి నేతలకైనా, నేను కూడా రేపు జాతీయ స్థాయి నేతను కాగలను అనే ఆశ, ఉత్సాహం నిరంతరం పని చేసేలా ప్రేరేపిస్తాయి. పక్షపాతం లేకుండా పనితీరు, ఫలితాలే ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పార్టీ నడిపించే వ్యూహకర్తలకు క్షేత్రస్థాయి సమర్థత దక్కుతుంది. ప్రత్యర్థి పార్టీలలో నడుస్తున్న కుటుంబ పాలన ను నిలదీసే నైతిక బలం ఒక్క బీజేపీకే సాధ్యమవుతుంది. ఈ గ్రాస్‌రూట్ నాయకత్వ నమూనాలో కొన్ని అంతర్గత సవాళ్లు కూడా లేకపోలేదు. క్షేత్రస్థాయి నుంచి కష్టపడి వచ్చిన నేతలకు సిద్ధాంతపరమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో విభిన్న సామాజిక సమీకరణాలను, గ్లామరస్ పాపులిజమ్‌ను తట్టుకుని ఓట్లుగా మలచడం ఒక్కోసారి క్లిష్టంగా మారుతుంది. అంతేకాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే మాస్ లీడర్లకు, కింది స్థాయి నుంచి ఎదిగిన ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న 'ఆర్గనైజేషనల్' నేతలకు మధ్య సమన్వయం కుదర్చడం జాతీయ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంటుంది.

## దేశంలో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ..



దేశంలో స్వైన్ ఫ్లూ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో, జాతీయ స్థాయి సన్నద్ధత, నివారణ చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా నిరంతర నిఘా, వ్యాధి వ్యాప్తి నిరోధక చర్యలు పటిష్ఠంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఢిల్లీతో పాటు ఇతర ప్రధాన ప్రాంతాల్లోని ఆసుపత్రులలో బెడ్ల లభ్యత, ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో పాటు అవసరమైన మందులు, టీకాల లభ్యతపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, హెల్త్ సెక్రటరీలతో కూడిన బృందానికి నిరంతరం కేసులను పర్యవేక్షించాలని సూచించారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ముందస్తుగా గుర్తించడం, బాధితులకు సకాలంలో చికిత్స అందించడం.. ప్రజల్లో పరిశుభ్రత, అవగాహన పెంపొందించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల జిల్లాల్లో కూడా అవసరమైన ఫ్లూ నిరోధక మందుల కొరత లేకుండా చూడాలని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖలను కోరారు.

## పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ మెరుపు ధర్నా



దిల్లీలోని పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి సాహిల్ లోచబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ పోలీస్ స్టేషన్ వద్దే బైఠాయించారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. గత నెల జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టిన సమయంలో పోలీసులు పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ ఘటనలో సాహిల్?కు పెల్లెట్లు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని, ఒక కంటి చూపు ప్రమాదంలో పడిందని రాహుల్ పేర్కొన్నారు. గాయపడిన సాహిల్‌కు దిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స జరిగినట్లు తెలిపారు. దాంతో సాహిల్ లోచబ్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదును తీసుకుని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై దిల్లీ స్థానిక డీసీపీతో కూడా ఆయన చర్చలు జరిపారు. అయినప్పటికీ కేసు నమోదు కాకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్దే నిరసనకు దిగారు.

"జులై 20న, జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు పెల్లెట్ గన్‌తో దాడి చేశారు. పెల్లెట్ల వల్ల తీవ్రంగా గాయపడిన సాహిల్ ఒక కంటి చూపు ఇప్పుడు ప్రమాదంలో ఉంది. శాంతియుత నిరసనపై ఇటువంటి క్రూరత్వం చట్టవిరుద్ధం మాత్రమే కాదు. ఇది ఒక తీవ్రమైన నేరం. ఈ దురాగతానికి హోం మంత్రి అమిత్ షా విద్యార్థులకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. ప్రధానమంత్రి కూడా వారికి క్షమాపణ చెప్పలేదు." అలాగే ఇప్పుడు, సాహిల్ న్యాయం కోసం ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలనుకుంటే, దానికి కూడా అనుమతించడం లేదని రాహుల్? అన్నారు. ఈ విధంగా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. "అమిత్ షా, మీరు న్యాయానికి ఎందుకంత భయపడుతున్నారు ఈ భయం మీరు మీ నేరాన్ని అంగీకరిస్తున్నారని చూపిస్తోంది" అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. సాహిల్?కు, అతడి లాంటి ప్రతి విద్యార్థి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ నేతల మద్దతు**

రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన విషయం తెలియడంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రాహుల్‌కు మద్దతు తెలిపారు. పోలీసుల తీరుపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదుపై స్పష్టత వచ్చే వరకు తమ నిరసన కొనసాగుతుందని తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు రాహుల్ గాంధీ నిరసనలోనే కూర్చున్నారని, ఆయనకు మద్దతుగా తాము అక్కడికి వచ్చినట్లు చెప్పారు. ఈ పోరాటంలో రాహుల్ విజయం సాధిస్తారన్న నమ్మకం ఆయనకు ఉందన్నారు.

**'మీరు చట్టాన్నీ గౌరవించరా?'**

ఇదిలా ఉండగా, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ అరాచక రాజకీయాలు చేయడం చాలా దురదృష్టకరం. ప్రస్తుతం ఆయన ఎలాంటి అనుమతి, ముందస్తు సమాచారం లేకుండా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నాకు కూర్చున్నారు. ఆయన ప్రస్తావిస్తున్న ఘటనపై ఇప్పటికే ఒక ఎఫ్ఐఆర్ నమోదైందని, దానిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు ఆయనకు తెలియజేశారు. దీనిపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రాహుల్ గాంధీ, మీరు ఏ చట్టాన్నీ గౌరవించరా? జాతీయ గీతం వందేమాతరంపై కాంగ్రెస్ వైఖరి కారణం గానే ఇప్పుడు ఆ పార్టీ ఇరుక్కుపోయిందని మేము అనుమానిస్తున్నాం, ఆరోపిస్తున్నాం. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ఇప్పుడు చేస్తున్న దానిని మేము ఖండిస్తున్నాం" అని అన్నారు.

**ఆగస్టు 14న ఫిర్యాదు**

కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, సాహిల్ లోచబ్ ఆగస్టు 14న తన న్యాయవాదులతో కలిసి దిల్లీ పోలీసులను ఆశ్రయించారు. పెల్లెట్ గన్ ఘటనపై లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. అయితే పోలీసులు ఐవో నంబర్ లేదా ఫిర్యాదు స్వీకరణకు సంబంధించిన రసీదు ఇవ్వలేదని పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఆగస్టు 17న కూడా ఈ విషయంపై ఈమెయిల్, ఫోన్ ద్వారా పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. దీంతో సాహిల్ రాహుల్ గాంధీ సహాయం కోరినట్లు పేర్కొన్నాయి. అనంతరం బాధితుడితో కలిసి రాహుల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేసినట్లు వెల్లడించాయి.

స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# హాస్టల్‌లో పసిబిడ్డ.. బాధ్యత ఎవరిది?



- తల్లిదండ్రుల నమ్మకానికి భద్రత కరువైందా?
- శ్రీకాళహస్తి బాలికల వసతి సముదాయంలో ఘటనకు తెర..
- విద్యార్థి అరెస్ట్ - వార్డెన్, ఎస్‌డబ్ల్యూవో సస్పెన్షన్

స్వర్ణసాగరం శ్రీకాళహస్తి, ఆగస్టు 22:

శ్రీకాళహస్తి బాలికల వసతి సముదాయంలో సోమవారం నవజాత శిశువు లభ్యమైన ఘటనకు శుక్రవారం తెరపడింది. అందరి అనుమానాలను నిజం చేస్తూ అదే వసతి గృహానికి చెందిన ఓ విద్యార్థిని గర్భం దాల్చి, అక్కడే శిశువుకు జన్మనిచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీంతో ఇన్ని రోజులుగా హాస్టల్‌లో ఏం జరిగింది? బాలిక గర్భం దాల్చేంత వరకు విషయం సిబ్బందికి ఎందుకు తెలియలేదు? అనే ప్రశ్నలు మరింత తీవ్రంగా మారాయి. పోలీసుల విచారణలో విద్యార్థిని తనతోపాటు పాఠశాలలో చదువుకున్న ఓ బాలుడితో పరిచయం ప్రేమగా మారిందని, అనంతరం శారీరక సంబంధం కారణంగా గర్భం దాల్చినట్లు అంగీకరించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు కూడా తెలిపినట్లు సమాచారం. విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక గర్భానికి కారణమైన బాలుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. శుక్రవారం రాత్రి అతడిని అరెస్టు చేసి తిరుపతికి తరలించినట్లు తెలిసింది. నిందితుడు, బాధిత విద్యార్థిని ఇద్దరూ నాగలాపురం గ్రామానికి చెందినవారిగా గుర్తించినట్లు సమాచారం.

**నిర్లక్ష్యానికి చర్యలు**

బాలికల వసతి గృహంలో జరిగిన పరిణామాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వసతి గృహ పర్యవేక్షణలో వైఫల్యం చోటుచేసుకుందన్న కారణాలతో వార్డెన్ జయసుధ, ఎస్‌డబ్ల్యూవో ఉదయశ్రీలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

**అసలైన ప్రశ్న.. తల్లిదండ్రుల నమ్మకానికి భద్రత ఏది?**

ఇది కేవలం ఓ బాలికకు సంబంధించిన ఘటనగా చూసి మరిచిపోవాల్సిన విషయం కాదు. ఇది పేద కుటుంబాలకు చెందిన వందలాది ఆడపిల్లల భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన ప్రశ్న.ఎస్సీ బాలికల వసతి సముదాయంలో తమ పిల్లలను చేర్పిస్తున్న తల్లిదండ్రులు.. అక్కడ సిబ్బంది తమ బిడ్డలను కంటికి రెప్పలా కాపాడతారనే నమ్మకంతో ఉంటారు. ఇంటికి దూరంగా ఉంటున్న తమ ఆడపిల్లలకు వసతి గృహమే మరో ఇంటిలా ఉంటుందని భావిస్తారు. పిల్లలు చదువుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలనే ఆశతో కష్టాలను భరిస్తూ వారిని హాస్టల్‌లో చేర్పిస్తారు. అలాంటి చోట ఓ విద్యార్థిని గర్భం దాల్చే వరకు విషయం బయటకు రాకపోవడం, చివరకు నవజాత శిశువు ప్రత్యక్షమైన తర్వాతే వ్యవహారం వెలుగులోకి రావడం తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతోంది.

**'మా పిల్లల పరిస్థితి ఏమిటి?'**

ఈ ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత వసతి గృహంలో చదువుతున్న ఇతర విద్యార్థినుల తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలైంది. తమ పిల్లలకు తగిన రక్షణ ఉందా? హాస్టల్‌లోకి ఎవరు వస్తున్నారు? విద్యార్థినుల కదలికలను సిబ్బంది పర్యవేక్షిస్తున్నారా? రాత్రివేళ భద్రత ఎలా ఉంది? విద్యార్థినులతో సిబ్బంది క్రమం తప్పకుండా మాట్లాడుతున్నారా? వంటి ప్రశ్నలు తల్లిదండ్రులను వెంటాడుతున్నాయి. ప్రభుత్వం బాలికల సంక్షేమం, విద్య, భద్రత కోసం ఎన్నో పథకాలు, నిబంధనలు, సదుపాయాలు కల్పిస్తున్నా.. అవి క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

**వ్యవస్థపై సమగ్ర పరిశీలన అవసరం**

ఒక్కరిద్దరిపై చర్యలు తీసుకోవడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వసతి గృహంలో విద్యార్థినుల భద్రతకు సంబంధించిన నిబంధనలు అమలవుతున్నాయా? సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా? విద్యార్థినులపై పర్యవేక్షణ ఎలా ఉంది? బయటి వ్యక్తుల రాకపోకలపై నియంత్రణ ఉందా? సీసీ కెమెరాలు, భద్రతా ఏర్పాట్లు పనిచేస్తున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉంది. పేద తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ వసతి గృహాలకు అప్పగించేది చదువు కోసం మాత్రమే కాదు.. భద్రతపై నమ్మకంతో. ఆ నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత యంత్రాంగానిదే. ఈ ఘటనలో అసలు తప్పిదం ఎక్కడ జరిగింది? ఇకపై ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ఏం చర్యలు తీసుకుంటారు? అన్నదానికి అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావాల్సి ఉంది.

# పని.. ప్రాథమిక హక్కు అవుతుందా?

స్వర్ణసాగరం న్యూఢిల్లీ

గ్రామీణ కార్మికులకు చట్టబద్ధంగా కల్పించిన ఉపాధి హామీని రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద పేర్కొన్న జీవించే హక్కుతో సమానంగా చూడగలమా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. పని హక్కును రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తించలేదని, దీనిని ఆదేశిక సూత్రాల పరిధిలోని బాధ్యతగా మాత్రమే చేర్చిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంతో పాటు వేతనాల చెల్లింపులో జరిగే జాప్యానికి పరిహారం ఇప్పించేలా ఆదేశాలివ్వాలంటూ అరుణా రాయ్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ధర్మాసనం విచారణ చేపట్టింది.

**అది ప్రజాస్వామ్య ఆకాంక్ష మాత్రమే**

రాజ్యాంగం పని హక్కును ప్రాథమిక హక్కుగా చేయలేదని, ఇది కేవలం నాలుగో భాగంలో ఉన్న ప్రజాస్వామ్య ఆకాంక్ష మాత్రమేనని జస్టిస్ బాగ్చీ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ ఆకాంక్షను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించి, దానికి అనుగుణంగా వేతనాలు ఇస్తుందని పేర్కొన్నారు. దీనిని ఆర్టికల్ 21తో సమానంగా చూడలేమన్నారు. ఒకవేళ పని హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తిస్తే, భవిష్యత్తులో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను తగ్గించుకున్నప్పుడు ఫలానా పథకాన్ని అమలు చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయగలదా అనే అతిపెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతుందని ఆయన పేర్కొన్నారు.

**పెరిగిన వేతనాలు, పనిదినాలు**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం 2026 జూలై 1 నుంచి 'వికసిత్ భారత్ --గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్, అజీవికా మిషన్ (గ్రామీణ)'(వీబీ--జీ ర్యామ్ జీ) చట్టాన్ని అమల్లోకి తెచి?చంది. పాత చట్టంలో గ్రామీణ కుటుంబానికి 100 రోజుల ఉపాధి కల్పించగా, కొత్త చట్టంలో దాన్ని 125 రోజులకు పెంచారు. కొత్త చట్టం ప్రకారం జాతీయ సగటు వేతనం రూ.298 నుంచి రూ.327కు పెరిగింది. పాత చట్టం కింద ఉన్న వేతనాల కన్నా కొత్త చట్టంలో వేతనాలు తగ్గకూడదనే నిబంధన కూడా ఉంది.

**కనీస వేతనం ఇవ్వకుంటే వెట్టి చాకిరీయే**

ఉపాధి హామీ చట్టం మారినప్పటికీ కనీస వేతనాలకు సంబంధించిన వివాదం ఇంకా కొనసాగుతోందని పిటిషనర్ తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. రాష్ట్రాలు నిర్దేశించిన కనీస వేతనాలను తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని, కనీస వేతనాల కంటే తక్కువ ఇస్తే అది వెట్టి చాకిరీ కిందకే వస్తుందని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు.

**ఉపాధి పరిధి కూడా తగ్గుతుంది**

ఉపాధి హామీ పథకానికి కనీస వేతనాల పరిమితిని విధిస్తే ఎదురయ్యే ఆచరణాత్మక ఇబ్బందులను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రభుత్వ వనరులు ఒకేలా ఉన్నప్పుడు, కనీస వేతనాలు పెంచాల్సి వస్తే, ఉపాధి పొందే కార్మికుల సంఖ్య తగ్గిపోతుందని ఆయన తెలిపారు. కనీస వేతనాల చట్టం వర్తింపు అనేది ఆ ఉపాధి పథకం కింద చేపట్టే పనుల స్వభావంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధి కింద చేసే పనులు కనీస వేతనాల చట్టం పరిధిలోకి రాకపోతే, ఆ చట్టం వర్తించదని సీజేఐ స్పష్టం చేశారు. సామాజిక చట్టాలను విస్తృతంగా అర్థం చేసుకోవాలన్న వాదనతో తానూ ఏకీభవిస్తానన్నారు.

**మళ్లీ పిటిషన్‌కు పిటిషనర్ అంగీకారం**

కొత్త చట్టం ఈ పిటిషన్‌లో ప్రస్తావించిన వేతన నిబంధనను సూచిస్తున్నందున, ప్రస్తుత పిటిషన్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకోవచ్చని ప్రశాంత్ భూషణ్ కోరారు. కొత్త పిటిషన్ వేయడం వల్ల మరింత జాప్యం జరుగుతుందన్నారు. అయితే, పాత పిటిషన్‌కు ఆధారమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ మారిపోయిందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కొత్త పథకం అమలుపై కోర్టుకు తాజా వివరాలు, గణాంకాలు అవసరమని తేల్చి చెప్పారు. వేతనాల చెల్లింపులో జాప్యానికి సంబంధించిన అంశం గతంలోనే 'స్వరాజ్ అభియాన్'తీర్పుతో పరిష్కారమైందని, ఆ తీర్పును అమలు చేయకపోతే కొత్తగా చర్యలు చేపట్టవచ్చని సూచించారు. దీంతో కొత్త చట్టం వీబీ--జీ ర్యామ్ జీ నిబంధనల ప్రకారం కనీస వేతనాలు, వేతనాల చెల్లింపులో జాప్యానికి పరిహారం కోరుతూ సమగ్ర వివరాలతో తాజా పిటిషన్ దాఖలు చేసేందుకు ప్రశాంత్ భూషణ్ అంగీకరించారు.

## రంగంలోకి ఈడీ

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్‌తోపాటు వైఎస్సార్ కడప జిల్లాలోని నిందితుల నివాసాల్లో మొత్తం 7 చోట్ల ఈడీ బృందాలు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి సంబంధించి హైదరాబాద్ కోకాపేట గోల్డెన్‌మైన్ రోడ్డులోని ఓపెన్‌స్కై స్పేస్ అపార్ట్‌మెంట్‌లోని నివాసంలోనూ, పులివెందులలోని ఇంట్లోనూ తనిఖీలు చేశాయి. పులివెందులలో అవినాష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు దేవిరెడ్డి శివశంకరరెడ్డి, యాదటి సునీల్ యాదవ్, షేక్ దస్తగిరి, తొండూరు మండలం టి.తుమ్మలపల్లెలో ఎర్ర గంగిరెడ్డి నివాసాల్లోనూ సోదాలు నిర్వహించాయి. అవినాష్‌రెడ్డి నివాసం నుంచి లెక్కల్లో చూపని రూ.24 లక్షల నగదు, 2 బ్యాంకు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది. నిందితుల నివాసాల నుంచి పలు కీలకపత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొంది.

**హత్య చేస్తే రూ.40 కోట్లు ఇస్తారు.. అందులో నీకు రూ.5 కోట్లు**

వివేకానందరెడ్డి 2019 మార్చి 15 అర్ధరాత్రి తర్వాత పులివెందులలోని ఆయన నివాసంలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు ఫిబ్రవరి 10న ఎర్ర గంగిరెడ్డి నివాసంలోనే కుట్ర రూపొందించినట్లు సీబీఐ దర్యాప్తులో తేల్చింది. 'వివేకానందరెడ్డిని చంపేయ్.. ఈ హత్య చేస్తే నీ జీవితం సెటిలైపోతుంది. నువ్వు ఒక్కడివే కాదు.. మేమూ నీతో వస్తాము. దీని వెనక వైఎస్ భాస్కరరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డి వంటి పెద్ద రాజకీయ నాయకులున్నారు. ఈ హత్య చేస్తే శివశంకరరెడ్డి రూ.40 కోట్లు ఇస్తారు. అందులో రూ.5 కోట్లు నీకు ఇస్తాను' అంటూ ఎర్ర గంగిరెడ్డి తనతో చెప్పారని ఈ కేసులో నిందితుడైన షేక్ దస్తగిరి అప్రూవర్‌గా మారి, సీబీఐకి వాంగ్మూలమిచ్చాడు. 'వివేకానందరెడ్డిని చంపాలని ఎర్ర గంగిరెడ్డి చెప్పిన రెండు, మూడు రోజుల తర్వాత సునీల్ యాదవ్ రూ.కోటి నగదు తీసుకెళ్లి దస్తగిరికి అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఇంత డబ్బు ఎక్కడిదని దస్తగిరి ప్రశ్నించాడు. వివేకా హత్య కోసం ఎర్ర గంగిరెడ్డికి శివశంకరరెడ్డి ఇవ్వగా.. ఆయన తనకు ఇచ్చారంటూ సునీల్ సమాధానమిచ్చారు' అని సీబీఐ అభియోగపత్రాల్లో పేర్కొంది. దస్తగిరికి అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ.కోటిలో నుంచి రూ.25 లక్షలు సునీల్ యాదవ్ అప్పు తీసుకున్నాడు. మిగతా రూ.75 లక్షలను దస్తగిరి తన స్నేహితుడైన సయ్యద్ మున్నా దగ్గర ఉంచినట్లు తేల్చింది. అందులో రూ.46.70 లక్షల నగదు, లెక్కల్లో చూపని బంగారు ఆభరణాలను సయ్యద్ మున్నా, అతని తల్లి పేరిట ఉన్న లాకర్ల నుంచి గతంలోనే సీబీఐ స్వాధీనం చేసుకుంది. సీబీఐ ఎఫ్ఐఆర్, అభియోగపత్రాల ఆధారంగా ఈడీ కేసు పెట్టి దర్యాప్తు ముమ్మరం చేసింది.

**చైతన్యరెడ్డిని విచారించిన ఈడీ**

వివేకా హత్య కేసులో కీలక నిందితుడైన దేవిరెడ్డి శివశంకరరెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డిని ఈడీ అధికారులు శుక్రవారం కడప నుంచి పులివెందులకు పిలిపించి, రెండు గంటల పాటు విచారించారు. వైద్య శిబిరం నిర్వహణ పేరిట 2023 నవంబరు 28న కడప కేంద్ర కారాగారానికి వెళ్లిన చైతన్యరెడ్డి.. అక్కడ రిమాండ్ ఖైదీగా ఉన్న దస్తగిరిని బెదిరించారంటూ గతంలోనే కేసు నమోదైంది. తాను చెప్పినట్లు సీబీఐ అధికారులకు వాంగ్మూలమిచ్చి సహకరిస్తే రూ.20 కోట్లు అడ్వాన్సుగా ఇస్తామని లేదంటే జైలు నుంచి బయటకొచ్చాక నీ అంతు చూస్తానని దస్తగిరిని చైతన్యరెడ్డి బెదిరించారనే ఆరోపణలున్నాయి. దీనిపైనే చైతన్యరెడ్డిని ఈడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.

పులివెందులలో అవినాష్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు జరిపినప్పుడు ఆయన లేరు. అవినాష్ చిన్నాన్న వైఎస్ మనోహర్‌రెడ్డి ఇంటి తాళాలు తీశారు. ఈడీ అధికారులు పలు ఆస్తులకు సంబంధించిన పత్రాల గురించి మనోహర్‌రెడ్డిని ప్రశ్నించారు.

## ఏపీ మున్సిపాలిటీల సమూల ప్రక్షాళన

-మొదటిపేజీ తరువాయి

యూఐడీఎఫ్ పథకాల ద్వారా ఇప్పటికే రూ.15,274 కోట్ల పనులు జరుగుతున్నాయి. అభివృద్ధి పనులను విడివిడిగా కాకుండా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర పనులన్నింటినీ ఒకేసారి సమగ్రంగా చేపట్టాలని పురపాలక శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. జనాభా వృద్ధి, భవిష్యత్ అవసరాలకు ముందే మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్? కుమార్ వెల్లడించారు.

**తొలిదశలో 1,153 ఎలక్ట్రిక్ ఆటోలు**

పట్టణాభివృద్ధితో పాటు పారిశుద్ధ్యం, రాజధాని నిర్మాణాలపైనా సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. చెత్త రహిత పట్టణాల కోసం 108 సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు ఇప్పటికే వర్క్ ఆర్డర్లు జారీ చేసింది. ఇంటింటి చెత్త సేకరణ కోసం తొలిదశలో 1,153 ఎలక్ట్రిక్ ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రంగంలోకి దించుతోంది. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం ఏకంగా రూ.66,802 కోట్ల పనులు మంజూరు కాగా, ఇప్పటికే రూ.43,422 కోట్ల పనులు మొదలయ్యాయి. పెండింగ్‌లో ఉన్న ఏపీ టిడ్కో ఇళ్ల నిర్మాణాలను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

## ఏళ్ల నిరీక్షణకు తెర.. చిరకాల స్వప్నం సాకారం

**డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు మార్గం**

**ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి ఘన సన్మానం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



విజయవాడ, స్వర్ణసాగరం

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియకు మార్గం సుగమం కావడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ చిరకాల స్వప్నం సాకారం కావడానికి కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్‌ను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఎ. విద్యాసాగర్ నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన చొరవతో ముఖ్యమంత్రి ఆమోదం, కేబినెట్ ఆమోదం లభించడంతో పాటు అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిందని తెలిపారు. అనంతరం చట్ట సవరణ ద్వారా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు మార్గం సుగమమైందని వివరించారు. ఎన్జీవో సంఘం చొరవతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఇప్పటికే మార్గం ఏర్పడిందని, తాజాగా యాక్ట్–30 సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం లభించడంతో సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కూడా మార్గం సుగమమైందని తెలిపారు. ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఉద్యోగుల జీవితాల్లో భరోసా కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, శాఖాధికారులు, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శి, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

**- ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎంపీ కేశినేని చిన్ని**

విజయవాడ, స్వర్ణసాగరం



పశ్చిమ నియోజకవర్గంలోని 38వ డివిజన్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్నతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చిన్ని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడినా, తమ సమస్యలను చెప్పుకునేందుకు సరైన వేదిక లేకపోయిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ వంటి వేదికలను ఏర్పాటు చేసిందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో నియోజకవర్గం మూడో స్థానంలో నిలవడం కార్యకర్తల బలానికి నిదర్శనమని అన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసి జిల్లాలోనే మొదటి స్థానాన్ని సాధించామని తెలిపారు. బుద్ధా వెంకన్న ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తున్నారని ప్రశంసించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై లడ్డూ ప్రసాదం, అన్నప్రసాద భవనాలను ప్రారంభించిన అనంతరం నేరుగా ప్రజాదర్బార్‌కు హాజరు కావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అన్ని పండుగలను అన్నదమ్ముల్లా కలిసి జరుపుకునే నియోజకవర్గం పశ్చిమ నియోజకవర్గమని పేర్కొన్నారు. తాను, బుద్ధా వెంకన్న అన్నదమ్ముల్లా కలిసి పనిచేస్తూ పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉమ్మడి చంటి, యేదుపాటి రామయ్య, ఏ. సుబ్బారెడ్డి, కామా దేవరాజు, నాగోతు రామారావు, గుర్రంకొండ, ధనేకుల సుబ్బారావు, జహీద్, రేగళ్ల లక్ష్మణరావు, విజయలక్ష్మి, నసీమా, కామాక్షి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కబళిస్తోన్న క్యాన్సర్!

-మొదటిపేజీ తరువాయి

అధికారులు గుర్తించారు. బాధితుల్లో సుమారు 70 శాతం మంది 40 నుంచి 69 ఏళ్ల మధ్య వయసు వారే కావడం మరింత ఆందోళన కలిగిస్తోంది. మహిళల్లో ప్రధానంగా రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లు అధికంగా నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉన్నప్పటికీ, రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలు గుర్తించిన వారిలో 88.2 శాతం మంది తదుపరి నిర్ధారణ పరీక్షలకు వెళ్లడం లేదని అధికారులు గుర్తించారు. దీంతో వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించే అవకాశాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. క్యాన్సర్ నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'బయోఫౌండ్రీ టాస్క్‌ఫోర్స్'ను ఏర్పాటు చేసి క్యాన్సర్ నిర్ధారణ, చికిత్స, పరిశోధనలను ఆధునికీకరించేందుకు చర్యలు చేపడుతోంది. డిజిటల్ హిస్టోపాథాలజీ, ఎలక్ట్రానిక్ వైద్య రికార్డులు, రాష్ట్రస్థాయి బయోబ్యాంక్ వంటి వ్యవస్థలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. క్యాన్సర్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, కడపలో సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 17 ఆంకాలజీ యూనిట్లు, 23 జిల్లాల్లో డేకేర్ కీమోథెరపీ కేంద్రాలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. క్యాన్సర్ చికిత్సలో వ్యాధిని తొలిదశలోనే గుర్తించడం అత్యంత కీలకమని, స్క్రీనింగ్‌లో అనుమానిత లక్షణాలు కనిపించిన వెంటనే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచడంతో పాటు స్క్రీనింగ్ తర్వాత తదుపరి పరీక్షలకు వెళ్లేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు

swarna sagaram_Swarna sagaram.qxd 8/21/2026 10:23 PM Page 1



# వరలక్ష్మి వ్రతంలో భక్తుల ఆగచాట్లు







## భక్తులు ఎక్కువ.. అన్నసంతర్పణ తక్కువ!

### ఏర్పాట్లపై భక్తుల అసహనం..

### ఈవో గిరికృష్ణ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

ముత్తుకూరు.. స్వర్ణ సాగరం

భక్తులు ఎక్కువగా రావడంతో అన్నసంతర్పణలో ఏర్పాట్లు సరిపోక వరలక్ష్మీ వ్రతానికి వచ్చిన మహిళా భక్తులు ఇబ్బందులు పడ్డారు. కృష్ణపట్నం గ్రామంలోని రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగినప్పటికీ అన్నదానం విషయంలో ఏర్పాట్లు విఫలమయ్యాయని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వరలక్ష్మీ వ్రతానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని ముందుగానే ప్రచారం చేశారు. గ్రామంలో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేసి మహిళా భక్తులను ఆహ్వానించారు. ఆలయ అర్చకుడు వెంకట నగేష్‌బాబు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని విశేష పుష్పాలంకరణతో అలంకరించారు. ఆలయ పాలకమండలి కూడా భక్తులను ఆహ్వానించింది. నిర్ణీత సమయానికి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

**అన్నదానంలో ఇబ్బందులు**

కృష్ణపట్నం గ్రామ జనాభా 5,868 మంది కాగా, ఇందులో సుమారు 2,500 మంది మహిళలు ఉన్నారు. స్థానికంగానే వెయ్యి మందికి పైగా మహ

# ఆర్.ఎం.పి డాక్టర్ రవి ధనక్రియ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు

## ఢిల్లీ ప్రతాప్ ని ఓదార్చారు డాక్టర్ సునీల్ కుమార్

ఐరాల, స్వర్ణ సాగరం ఆగస్టు 21 :

ఐరాల మండలం వైయస్సార్ సీపి విద్యార్థి విభాగం అధ్యక్షులు ఢిల్లీ ప్రతాప్ తండ్రి ఆర్.ఎం.పి డాక్టర్ రవి స్వర్గీయులైనారు విరి అంత్యక్రియలకు పూతలపట్టు నియోజకవర్గం వైయస్సార్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ , ఐరాల మండలం వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు, పారిశ్రామికవేత్త పూజారి మోహన్ రెడ్డి, ఢిల్లీ ప్రతాప్ కుటుంబాన్ని ఓదార్చారు వారి దహన సంస్కారాలకు



ఆర్థిక సహాయం అందజేశారు, వారికి ధైర్యం చెప్పారు, ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని పలువురు పార్టీ నాయకులు, మండలంలోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రావణ లక్ష్మి వ్రతం



కాణిపాకం.స్వర్ణసాగరం. ఆగస్టు 21

కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజ స్వామి వారి ఆలయం నందు శుక్రవారం శ్రావణ లక్ష్మి వ్రతం సందర్భంగా వైభవంగా శ్రీ స్వామివారికి ఉదయం గరుడసేవ నిర్వహించడం జరిగింది, ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా శ్రీనివాసభట్టాచార్యులు , కాణిపాకం వారు నిర్వహిస్తారు, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు, కాణిపాకం మాజీ సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, మనోహర్ నాయుడు, చిన్నారెడ్డి, పుణ్య సముద్రం రవి,సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి, తదితరులు పాల్గొన్నారు.



# డోర్నకల్ డబ్ల్యూ జే ఐ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### మండల అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, ఉపాధ్యక్షులు నాగరాజు

స్వర్ణసాగరం డోర్నకల్ ఆగస్టు 21





డోర్నకల్ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కు కృషి చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ జే ఐ) నాయకులు పిలుపునిచ్చారు. డోర్నకల్ మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గార్ల మండలంలోని మర్రిగూడెం గ్రామంలోని శ్రీ వేట వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన డబ్ల్యూ జే ఐ సమావేశానికి జిల్లా అడహాక్ కన్వీనర్ హనుమండ్ల రామకృష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.డోర్నకల్ మండలం నూతన అధ్యక్షుడిగా మారబోయిన నవీన్‌కుమార్ (శ్రీనాథ్ ), ఉపాధ్యక్షుడిగా భయ్యా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మంద ప్రకాష్, కోశాధికారిగా అజ్మీర సక్రం,సహాయ కార్యదర్శిగా భూక్య యువరాజు ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా పిట్టల సర్వేష్, నలమాస మహేష్,కొలిపాక విజయ్,కొప్పుల సత్యనారాయణ,ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను ధారావత్ నరేష్ లక్ష్మీనారాయణ వ్యాస్, లాకన్,సన్మానించి అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నూతన కమిటీ ఐక్యంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ హనుమాండ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులు,వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి రాచగొల్ల సత్యనారాయణ, బండ రాజకుమార్, తక్కల్లపల్లి శ్రీనివాస్,కొండి సాయికిరణ్, శివరామకృష్ణ,హెచ్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

## మహిళలు, బాలికల ఫోన్లలో యాప్ డౌన్ లోడ్లు

చిత్తూరు.స్వర్ణసాగరం. ఆగస్టు 21

మహిళల భద్రతకు మరింత భరోసా కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయాన్ని త్వరగా పొందేందుకు ఉపయోగపడే శక్తి యాప్ గురించి మహిళలు, బాలికలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, వారి మొబైల్ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు.చిత్తూరు జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి,ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మహబూబ్ బాషా పర్యవేక్షణలో, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మహిళా పోలీసులు, శక్తి టీం సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా, చిత్తూరు పట్టణంలోని గిరింపేట దుర్గమ్మ గుడి వద్ద మహిళా పోలీస్ స్టేషన్ ఎస్.ఐ. శ్రీమతి కరీమున్నీషా మరియు సిబ్బంది మహిళలకు శక్తి యాప్ ఆవశ్యకత, ఉపయోగాలు మరియు మహిళల భద్రతకు అందించే పోలీసు సహాయం గురించి వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు పోలీసుల సహాయాన్ని




త్వరగా పొందేందుకు శక్తి యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారికి అవగాహన కల్పించారు. అనంతరం అక్కడికి వచ్చిన మహిళలు, బాలికల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, దాని వినియోగ విధానాన్ని వివరించారు.అదేవిధంగా, మహిళలు మరియు బాలికలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండటం, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించడం,




మహిళలపై జరిగే నేరాలు, వేధింపులు లేదా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు.మహిళల భద్రతకు శక్తి యాప్ ఒక ముఖ్యమైన భద్రతా సాధనమని, ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని ఎస్.ఐ.సూచించారు.ఈ

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# అష్ట ఐశ్వర్యాలు సిద్ధించాలని వరలక్ష్మి వ్రతం చేయాలి

### ఆలయ అర్చకులు నరసింహ ఆచార్యులు



స్వర్ణ సాగరం పూతలపట్టు ఆగస్టు 21

శ్రావణమాసం లో వచ్చే పౌర్ణమి కి ముందు శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుపుకుంటారు. దేవాలయంలో వరలక్ష్మీ వ్రతం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వరలక్ష్మి దేవి వ్రత విశిష్టత గురించి భక్తులకు తెలియజేశారు. వరలక్ష్మి దేవిని భక్తి శ్రద్ధలతో ఆరాధించిన సిరి సంపదలు, సౌభాగ్యం, ఐశ్వర్యం సిద్ధిస్తాయని ఆలయ అర్చకులు తెలిపారు . ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకులు నరసింహ ఆచార్యులు, స్థానిక గ్రామస్తులు పరిసర గ్రామ మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# పేదలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అభయం కౌన్సిలర్ మంజుల

### 23వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు



స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 21

పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నిధులు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని 23వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు తెలిపారు.19వ వార్డుకు చెందిన బాధితుడు ఉదరి సత్యనారాయణ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ సహాయక చెక్కును ఆమె అందజేశారు.ఈ సందర్భంగా మంజుల హరిబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల పరిశీలన వేగవంతమై,చెక్కులు త్వరగా మంజూరవుతున్నాయని పేర్కొన్నారు.గతంలో నిధుల మంజూరు దాదాపు 30 శాతంగా ఉండగా,ప్రస్తుత ప్రభుత్వం దానిని 40 శాతానికి పెంచి పేదలకు మరింత లబ్ధి చేకూరుస్తోందని వివరించారు.స్థానిక వార్డు ప్రజలు ఆరోగ్యపరమైన సమస్యలు లేదా ఇతర ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఆపద సమయంలో ప్రభుత్వం అందించిన ఈ ఆర్థిక సాయం పట్ల బాధితుడు ఉదరి సత్యనారాయణ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు,వార్డు కమిటీ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివంగత సీఓ కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక తోడ్పాటు అందించిన మున్సిపల్ పాలకవర్గం



స్వర్ణసాగరం సూర్యాపేట జిల్లా ఆగస్టు / 21

హుజూర్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సిఓ)గా విధులు నిర్వహిస్తూ ఇటీవల అకాల మరణం చెందిన సాలె సాయి కృష్ణ కుటుంబాన్ని మున్సిపల్ పాలకవర్గం, అధికారులు పరామర్శి ంచారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులను కలసి సానుభూతి తెలిపారు. అనంతరం పాలకవర్గం తరపున రూ.2.00 లక్షల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... సాయి కృష్ణ విధి నిర్వహణలో అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.ఆయన కుటుంబానికి మున్సిపల్ పాలకవర్గ ం,యంత్రాంగం అన్ని వేళలా అండగా ఉంటుందని భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ మేనేజర్ ఎ.అశోక్ రెడ్డి, పాలకవర్గ కౌన్సిల ర్లు,కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

swarna sagaram_Swarna sagaram.qxd 8/21/2026 10:23 PM Page 2



# సంత గేటు తాత్కాలిక మూసివేత

## 24 - 27 వ తేదీ వరకు మరమ్మతులు

### సూచిక బోర్డు అమర్చిన రైల్వే అధికారులు - ప్రత్యామ్నాయ మార్గాలు వాడాలని సూచన

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 21




రేణిగుంట పట్టణంలోని రైల్వే సంత గేటు వద్ద అత్యవసర మరమ్మతులు, భద్రతా పనులు చేపట్టేందుకు రైల్వే అధికారులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఈనెల 24వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటును పూర్తిగా మూసివేయనున్నారు. వరుసగా నాలుగు రోజుల పాటు గేటు మూసివేయనున్న నేపథ్యంలో స్థానిక ప్రయాణికులు, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని రైల్వే అధికారులు,రైల్వే పోలీసులు సూచించారు.


# చిందేపల్లి సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



స్వర్ణసాగరం ఏర్పేడు :-

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ దాక్షాయణీ, పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఆలయ ధర్మకర్త గంగలపూడి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి ప్రత్యేక నోములు, విశేష పూజా కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టారు.వరలక్ష్మీ వ్రత పూజల్లో ఏర్పేడు మండలంలోని పరిసర గ్రామాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నోములు నోచుకున్నారు. అనంతరం అమ్మవార్లను, సిద్ధేశ్వరస్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సరస్వతికండ్రిగలో వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవం



స్వర్ణసాగరం ఏర్పేడు :-

మండలంలోని సరస్వతికండ్రిగ గ్రామంలో శ్రీ రామాలయం సన్నిధిలో శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వెంకయ్యస్వామి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.ఈ నెల 22వ తేదీ శనివారం ఉదయం 5 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో యజ్ఞం, హోమ కార్యక్రమాలతో ఆరాధన మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం రెండు రోజుల పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చే భక్తులు కాయ కర్పూర హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.మూడో రోజు సోమవారం సాయంత్రం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం దీపకాంతులు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వెంకయ్యస్వామి చిత్రపటాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగిస్తూ భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ప్రతి సంవత్సరం గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించే ఈ ఆరాధన మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకయ్యస్వామి కృపాకటాక్షాలు పొందాలని నిర్వాహకులు కోరారు.

# శాంతియుత జాతరలోని ఆకతాయిలకు తప్పని రిమాండ్

## ప్రజల శాంతి భద్రతలకు అఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం - సీఐ ఎస్ జయచంద్ర

రేణిగుంట స్వర్ణ సాగరం ఆగస్టు 21



రేణిగుంట గంగమ్మ జాతర లో గొడవ పడిన వేణుగోపాల పురం కి చెందిన
1) పల్లం మదన్,
2) మేకల అశోక్
3) కె.కార్తీక్ ఏ కె.హస్వంత్ ముని కుమార్,
4) కె.వంశీ,
5) సి.బాలకృష్ణ,
6) ఎన్.విమల్
జ్యోతి నగర్ కి చెందిన
1) ఆర్.చంద్రశేఖర్ ఏ చందు,
2) ఏ. జస్వంత్,
3) ఆర్.భానుప్రకాష్,
4 ) ఏ.హేమ కుమార్,
5) ఎ. దిలీప్,
6) ఆర్. నితీష్ ఏ నితీష్ కుమార్,
7) చైతన్య కుమార్ అను వారు పరస్పర గొడవలకు పాల్పడి ఒకరికి ఒకరు పై పిర్యాదు చేసుకోవటం వలన, రేణిగుంట పోలీస్ వారు ఇరువురి పై కేసులు నమోదు చేసి రిమాండ్ కి పంపారు. రేణిగుంట అర్బన్ పోలీస్ వారు పత్రికా ముఖంగా పట్టణ ఆకతాయిలకు హెచ్చరిస్తూ తెలియచేశారు – ప్రజాశాంతి, ప్రజా భద్రతకు భంగం కలిగించే విధంగా వ్యక్తిగత గొడవలు, కొట్లాటలు, దాడులు, బెదిరింపులకు పాల్పడే వారిపై రేణిగుంట పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, చిన్నచిన్న వ్యక్తిగత వివాదాలను పెద్దవిగా చేసుకుని బహిరంగ ప్రదేశాల్లో పరస్పరం కొట్లాడుకోవడం, ఇతరులను రెచ్చగొట్టడం, అసభ్య పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడటం వంటి చర్యల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వివాదాలు ఉన్న పక్షంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించి సమస్యను చట్టపరంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ఎవరైనా కొట్లాటలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, వారి మీద చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, అవసరమైన కఠిన చర్యలు తీసుకుంటామని రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ హెచ్చరించారు.ప్రజలు కూడా ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సీఐ ఎస్ జయచంద్ర తెలిపారు.

# పద్ధతి మార్చుకొని నడుచుకుంటే మంచిది

## సీనియర్ దళితనేత యాగాన్ని బెన్ని హితవు....

పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 21.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి 1991 నుండి రౌడీ దర్బార్ రాజకీయాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని అహింసా మార్గంలో ముందుకు సాగితే మంచిగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత యాగాన్ని బెన్ని హితవు పలికారు. శుక్రవారం పునబాక గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యనారాయణ రెడ్డి చేపట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమం వల్ల దళితుల మధ్య విభేదాలు పెరగడంతో పాటు ఘర్షణ వాతావరణం నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల దళితుల మధ్య చిచ్చుపెట్టే రాజకీయ కుతంత్రాలను వదిలి మంచిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తొలినుంచి గొడవలు, కొట్లాటలు, మర్డర్లు, రౌడీయిజం చేసుకుంటూ రాజకీయ రంగు పూసుకుని ముందుకు సాగుతున్న కామిరెడ్డికి దేవుడు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరారు.

ఖబడ్దార్ కామిరెడ్డి : సీనియర్ దళితనేత పోలయ్య.. గుడ్ మార్నింగ్ కార్యక్రమం పేరుతో మండలంలో ఉన్న 500 మంది అనుచరులను వెంటబెట్టుకుని ఊరు మీద ఎగబడతాం అంటే చూస్తూ ఊరుకోమని దళిత సీనియర్ నేత పోలయ్య ఖబడ్దార్ కామిరెడ్డి అంటూ వైకాపా రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి ని ఘాటుగా హెచ్చరించారు. తెలుగు గంగా జలాలను దక్షిణ ప్రాంత ప్రజలకు అం కితం చేసిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహనీ యుడు అని, ఆయన విగ్రహ ం ఏర్పాటు కోసం తీసిన గోతిలో చెత్త వేసిన దుర్మార్గు డు సత్యనారాయణ రెడ్డి అంటూ ఘాటుగా విమర్శించారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమం చేసుకోవడానికి ఆయనతోపాటు గ్రామంలో ఉన్న వైకాపా నాయకులకు ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు.



బెదిరింపులు మానుకోవాలి : లోకేష్ నాయుడు. .పొడిచేస్తా, చంపేస్తా అంటూ చేస్తున్న బెదిరింపులను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి మానుకోవాలని తెలుగుదేశం పార్టీ యువజన నాయకుడు నర్రావులా లోకేష్ నాయుడు హెచ్చరించారు. మండలంలోని ప్రజలందరికీ అన్ని ప్రాంతాల్లో తిరిగే స్వేచ్ఛ ఉందని, మంచిగా బతకడం కోసం ప్రతి ఒక్కరూ అన్ని ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారని చెప్పారు. అయితే మా ఊరికి వస్తే అలా చేస్తాం ఇలా చేస్తామంటూ బెదిరించడం మంచి పద్ధతి కాదని చెప్పారు. వయసు మీరిన సత్యనారాయణ రెడ్డికి అంత ఉంటే వయసులో ఉన్న తమకు ఇంకా ఎక్కువే ఉంటుందని పరోక్షంగా హెచ్చరించారు.

స్థానిక సంస్థల్లో అన్ని కైవసం చేసుకుంటాం: రెడ్డి శ్రీనివాస్, జనసేన యువ నాయకుడు...... మండలంలో అన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం బిజెపి జనసేన కలిసి ఉన్నాయని స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకునే దిశగా కోటమ్మ నాయకులు కలిసి పని చేస్తామని జనసేన పార్టీ యువజన నాయకుడు రెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి నాయకుల మధ్య వివాదాల పెట్టే విధంగా సత్యనారాయణ రెడ్డి వ్యవహరిస్తున్నారని అలాంటి ధోరణిని మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరి నాయుడు, యుగంధర్, గాంధీ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 24న ఛలో కలెక్టరేట్ ను జయప్రదం చేయండి

## - సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసినాగరాజు

స్వర్ణసాగరం ఏర్పేడు: ఆగస్టు 21



స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచినా దళితవాడల్లో మౌలిక సదుపాయాల కొరత కొనసాగుతుండటం బాధాకరమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, రైతు కార్మిక సంఘం, రైతు సంఘం తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సామాజిక శంఖారావం సర్వేలో గ్రామీణ ప్రాంతాల్లో దళితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.ఏర్పేడు మండలంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పల్లంపేటలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితవాడల్లో స్మశానవాటికలు, స్మశానాలకు వెళ్లేందుకు రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇళ్లు, సెంటు భూమి లేని దళిత కుటుంబాలు ఇంకా వున్నాయని, పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు.దళితుల సమస్యల పరిష్కారంలో జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు జాప్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. సామాజిక శంఖారావం సర్వేలో గుర్తించిన సమస్యలను ఇప్పటికే కలెక్టర్‌కు సమర్పించామని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 24న నిర్వహించే ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ సమస్యలను అర్జీల రూపంలో తీసుకుని తిరుపతి కలెక్టరేట్‌కు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగయ్య, వెంకటాద్రి, కేవీపీఎస్ నాయకులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పుతేరి గ్రామంలో ఓటర్ల రీ-వెరిఫికేషన్

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ



మండలంలోని పుత్తెరి గ్రామంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఓటర్ల రీ–వెరిఫికేషన్ కార్యక్రమాన్ని అధికారులు చేత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓటర్ల వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు మరియు ధృవీకరణ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని ఏవైనా తప్పులు ఉన్న ,మార్పులు సంబంధించి వివరాలను అధికారులు దృష్టికి తీసుకురావాలని వారి కోరారు.ఈ కార్యక్రమంలో బీఎల్ఓ తేజ, పంచాయతీ కార్యదర్శి గోపి పాల్గొని ఓటర్ల వివరాల పరిశీలనను పర్యవేక్షించారు. బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు హరిబాబు రెడ్డి, టీడీపీ మాజీ సర్పంచ్ రామ్మూర్తి, టీడీపీ బీఎల్ఏ రమేష్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు దయాసాగర్, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో అంబరాన్నంటిన వేడుకలు



మనుబోలు, స్వర్ణ సాగరం:

శ్రావణ మాసం అనగానే పర్వదినాల శోభ సంతరించుకుంటుంది. అందులోనూ సకల సౌభాగ్యాలను, అష్ట ఐశ్వర్యాలను ప్రసాదించే వరలక్ష్మీ వ్రతం వేళ మనుబోలు, నాయుడుపేట, గూడూరు తదితర ప్రాంతలు భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. శ్రీ మహాలక్ష్మీ దేవికి అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్ర శుక్రవారం రోజున పరిసర ప్రాంతాల్లో వరలక్ష్మీ వ్రత వేడుకలు అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగాయి. మండల కేంద్రల తో పాటు చుట్టుపక్కల గ్రామాలన్నింటిలోనూ తెల్లవారుజాము నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఇళ్లన్నింటినీ మామిడి తోరణాలు, రంగురంగుల రంగవల్లులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహిళలు ఉదయాన్నే తలస్నానాలు ఆచరించి, పట్టు వస్త్రాలు ధరించి అమ్మవారి పూజకు సర్వం సిద్ధం చేసుకున్నారు.స్థానిక మహిళలు తమ ఇళ్లలో ప్రత్యేకంగా పీఠం ఏర్పాటు చేసి, అందుపై శ్రీ వరలక్ష్మీ దేవి ప్రతిమను ప్రతిష్టించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమలు, అష్టోత్తర శతనామావళి పూలతో అమ్మవారిని అర్చించారు. కొత్త కుండలు, పండ్లు, తమలపాకులు, వక్కలతో పాటు నైవేద్యంగా రకరకాల పిండి వంటలు, పరమాన్నం సమర్పించి మంగళహారతులు పట్టారు.మనుబోలు, నాయుడుపేట, గూడూరు లోని ప్రముఖ దేవాలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులు భారీ సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.అమ్మవారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి.పూజ ముగిసిన తర్వాత ముత్తైదువులు ఒకరికొకరు తాంబూలాలు, వాయినాలు ఇచ్చుకుని అమ్మవారి ఆశీస్సులు కోరారు. ఈ వేడుకల్లో చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.కుటుంబ సభ్యులంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరుకుంటూ మహిళలు భక్తితో వ్రతం ఆచరించారు. ఈ పవిత్ర దినం సందర్భంగా అన్ని ప్రాంతాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఏ ఇంటికి వెళ్లినా పసుపు కుంకుమల శోభ, భక్తి పారవశ్యం ఉట్టిపడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో ఈ వేడుకలు దిగ్విజయంగా ముగిశాయి

శనివారం 22 ఆగస్టు 2026

స్వర్ణసాగరం
RNI No : APTEL/2020/15905
జాతీయ తెలుగు దినపత్రిక



# కామిరెడ్డి అరెస్టు-బెయిల్ పై విడుదల

## గుడ్ మార్నింగ్ కార్యక్రమానికి వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు





పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు21.

మండలంలోని పునబాక గ్రామం లో చేపట్టదలచిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని స్థానిక ఎస్సై ఆదిలక్ష్మి తమ సిబ్బందితో కలిసి మార్గం మధ్యలో అడ్డుకొని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సత్యనారాయణ రెడ్డి తో పాటు పార్టీ నాయకులు గిరి రెడ్డి, రామ్మూర్తి రెడ్డి, ప్రసాదులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కారు తోపాటు తాళాలు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలీస్ స్టేషన్లో నిర్బంధించిన పోలీసులు కామిరెడ్డిని నాయుడుపేట సివిల్ కోర్టు న్యాయమూర్తి ముందు హాజరు పరిచారు. గుడ్ మార్నింగ్ కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ గడిచిన రెండేళ్ల కూటమి పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ, గత జగనన్న పాలనలో అందిన సంక్షేమ ఫలాలను గుర్తు చేస్తూ ప్రశాంతంగా ముందుకు సాగుతున్న కామిరెడ్డి గుడ్ మార్నింగ్ కార్యక్రమానికి కోటమే నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ ఇక్కడ పోలీసులు అధికార పార్టీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను పట్టించుకోకుండా ప్రశాంతంగా ముందుకు సాగుతున్న వైకాపా నాయకులపై లాఠీలు జులిపిస్తూ, అక్రమ కేసులు బనాయిస్తూ అన్యాయంగా వ్యవహరిస్తున్నారు. అక్రమంగా అరెస్టు చేసిన సత్యనారాయణ రెడ్డిని అదే రోజు నాయుడుపేట సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. దాంతో సత్యనారాయణ రెడ్డి కి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాట్లాడుతూ..ఉదయం అరెస్టు.. సాయంత్రానికి బెయిల్ మంజూరు అయిందని, అక్రమ కేసులతో భయపెట్టాలనుకున్నా టిడిపి నాయకులకు న్యాయం ముందు అవి నిలవలేవు అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు.అరెస్టులు చేసి న్యాయ పోరాటాన్ని, గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని అణచలేరని, కేసులు పెట్టి భయపెట్టలేరని, ప్రజల కోసం పోరాడే గొంతును ఎవరూ మూయించలేరని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే దౌర్జన్యాలకు పాల్పడుతున్న కూటమి నాయకులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.అక్రమ కేసులకు కోర్టు తీర్పే సమాధానం.. న్యాయం గెలిచింది, ప్రజా పోరాటం నిలిచింది" అంటూ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# ఇరుగుళంలో జాడలేని ఇంటింటికి తెలుగుదేశం.?

## ఏమైంది అక్కడి నాయకులకు...? ఇదే ఎవరి నోట విన్న రచ్చ....?

స్వర్ణ సాగరం సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలోని కొన్ని కీలక పంచాయతీల్లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించే దిక్కే లేదు ఇదే అంశంపై ప్రతి ఒక్కరూ చర్చించుకోవడం కొద్దిరోజులుగా ఎక్కువైంది. ప్రధానంగా సత్యవేడు మండలం ఇరుగుళం ఎంపీటీసీ స్థానం గత నాలుగున్నర సంవత్సరాల క్రితం టిడిపి ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. ఈ ఎంపిటిసి స్థానం పరిధిలో వైసిపి మండల అగ్ర నాయకులు కూడా ఉన్నారు రాజీ ఫార్ములా తో అప్పట్లో ఇరుగుళం ను టిడిపి దక్కించుకోగా.. సత్యవేడు – 02 ఎంపిటిసి స్థానాన్ని వైసిపి ఏకగ్రీవం చేసుకున్న విషయం తెలిసిందే ఇదిలా ఉండగా ఇరుగుళంలో పసుపు జెండా నాయకులు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం జరపాల్సి ఉంది వివిధ కారణాలతో అక్కడ నాయకులు, కార్యకర్తలు పై కార్యక్రమం జరపడానికి ఆసక్తి కనప రచడం లేదు. వీటివెనుక బలమైన కారణాలు ఉన్నాయని కొందరు చెబుతున్నారు. ఇరుగుళం పాతూరులో ఓ యువకునికి విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగం కొందరు కల్పించారు ఈ విషయంలో పార్టీ సీనియర్లకు, పార్టీ పటిష్టత కోసం శ్రమించిన వారికి ఒక్క మాటైనా చెప్పకుండా ఇష్టానుసారం వ్యవహరించారని, ఈ కారణంతో నిప్పులు కక్కుతూ పార్టీ కార్యక్రమాలకు వారు దూరంగా ఉంటున్నారని ప్రచారం సాగుతోంది. అధికార పార్టీకి సంబంధం లేని ఓ పెద్ద భూస్వామి సిఫార్సుకు పచ్చ



జెండా ఊపి పంచాయతీలో నిశ్శబ్ద వాతావరణం తీసుకువచ్చారని కార్యకర్తలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారని పార్టీ వర్గాల సమాచారం. ఇదే పంచాయతీలో ఓ మహిళకు ఇచ్చిన నామినేట్ పోస్ట్ వ్యవహారం కూడా అప్పట్లో తీవ్ర దుమారం కు దారితీసింది. మరికొన్ని చోట్ల కూడా ఇలాంటి పరిస్థితి జరిగిందని అందువల్ల స్థానిక ఎన్నికల్లో తాము కూడా నటనకు అగ్ర తాంబూలం వేస్తామని సీనియర్లు వాపోతున్నారు ఇక్కడ( ఇరుగుళం ) పరిస్థితులు చక్కదిద్దే దిక్కేలేదా అంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గర పడటంతో ఇకనైనా అధిష్టానం పార్టీ బలోపేత కార్యక్రమాలపై చొరవ తీసుకోవాలని కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు

# రోడ్లు లేక.. నరకయాతన....!

స్వర్ణ సాగరం సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వెంకటరాజులకండ్రిగలో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు లేకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారీ రహదారులు బురదమయంగా మారి నడిచి వెళ్లడమే నరకప్రాయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు వెడల్పు లేకపోవడంతో వాహనాలు సైతం సులభంగా రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని, గ్రామంలోని రహదారులు కొండ ప్రాంతాల్లోని ఘాట్ మార్గాలను తలపిస్తున్నాయని వారు చెబుతున్నారు. మరోవైపు గ్రామం చుట్టూ అటవీ ప్రాంతం ఉండటంతో రాత్రివేళల్లో పాములు, విషపూరిత జీవులు సంచరిస్తున్నాయని, వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో చీకట్లో బయటకు రావాలంటే ప్రాణభయంతో వణికిపోవాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏ క్షణంలో ఏ ప్రమాదం ఎదురవుతుందోనన్న ఆందోళనతో జీవిస్తున్నామని అంటున్నారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు ఎందుకు వేయడం లేదని అధికార పార్టీ నాయకులను ప్రశ్నిస్తే.. సిమెంట్ రోడ్లు వేస్తే తమకు డబ్బులు రావడం లేదని చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల అవసరాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రామంలోని రహదారుల పరిస్థితిని పరిశీలించి సిమెంట్



రోడ్ల నిర్మాణం, రోడ్ల వెడల్పు, వీధి దీపాల ఏర్పాటుపై తక్షణ చర్యలు చేపట్టి తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం

# గుంజవరంలో రూ.50 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

## కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేసిన ఏపీ స్పోర్ట్స్ ఆధారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి



పోలవరం స్వర్ణ సాగరం

పోలవరం మండలం ప్రగడపల్లె పంచాయతీ పరిధిలోని గుంజవరం గ్రామంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు పోలవరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బోరగం శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు.గ్రామంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కృగ్రామంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ సందర్భంగా గ్రామస్థులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మంగిన వెంకట రమణ (కొండ) మాజీ జెడ్పీటీసీ కుంజం. సుభాషిణి, మాజీ ఎంపిటిసి వెంకటాచలం, మాజీ సర్పంచ్ కలుం బాపిరాజు,ఆకుల రాజా నల్ల రాంబాబు జనసేన నాయకులు మామిడిపల్లి. ప్రసాద్ కూటమి నాయకులు, కార్యకర్తలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# వందేళ్లు వర్ధిల్లు జితేంద్ర



పెళ్లకూరు స్వర్ణ సాగరం ఆగస్ట్ 21.

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన నేత చింతపూడి గ్రామానికి చెందిన యువ నాయకుడు సాగి జితేంద్ర వందేళ్లు వర్ధిల్లాలి అంటూ స్థానికులు ఆశీర్వదించారు. జితేంద్ర పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు జితేంద్ర వందేళ్లు ఆనందంగా వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా దీవించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# నేర పరిశోధనపై శిక్షణ



కొయ్యలగూడెం స్వర్ణ సాగరం

జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,పోలవరం డీఎస్పీ కె. జయకృష్ణ పర్యవేక్షణలో పోలవరం ఎస్సై పి. అప్పారావు కొయ్యలగూడెం ఎస్సై వి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలోశుక్రవారం కార్మెల్‌పురం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల మైదానంలో పోలవరం సర్కిల్ పోలీసులకు ప్రత్యేక పరేడ్, నేర పరిశోధనపై శిక్షణ నిర్వహించారు,నేరస్థలాన్ని శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించడం, ఫొటోలు తీయడం,భౌతిక సాక్ష్యాలను సేకరించి భద్రపరచడం, రఫ్‌స్కెచ్ రూపొందించడం, సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు, కోర్టులో నిలిచేలా సాక్ష్యాలను పకడ్బందీగా సేకరించాలని సూచించారు,పోలీసులు సమయపాలన, క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని డీఎస్పీ జయకృష్ణ అన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని దర్యాప్తు నాణ్యతను పెంచుకోవాలని సూచించారు, కార్యక్రమంలో ఎస్సైలు పి.అప్పారావు, వి. చంద్రశేఖర్,సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్ర పరిశ్రమలో విషాదం..
# దిగ్గజ నటి 'షావుకారు జానకి' కన్నుమూత!



భారతీయ చలనచిత్ర పరిశ్రమ మరో గొప్ప దిగ్గజాన్ని కోల్పోయింది. నాలుగు తరాల ప్రేక్షకులను తన అద్భుతమైన అభినయంతో మంత్రముగ్ధులను చేసిన అలనాటి ప్రముఖ సీనియర్ నటి 'షావుకారు' జానకి (94) తుదిశ్వాస విడిచారు. వయోభారంతో పాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు కొద్ది రోజుల క్రితం చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆమె పరిస్థితి విషమించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కన్నుమూసినట్లు వైద్యులు వెల్లడించారు. ఆమె మరణవార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రిలో డిసెంబర్ 12, 1931న జన్మించిన శంకరమంచి జానకి (అసలు పేరు) రంగస్థల నటిగా తన కళా జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత రేడియో నాటికల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, 1950లో ఎన్టీఆర్ సరసన విడుదలైన సరికొత్త సంచలన చిత్రం 'షావుకారు' ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ మొదటి చిత్రంతోనే ఆమె నటనకు ప్రేక్షకులు ఫిదా కావడంతో, ఆ సినిమా పేరే ఆమె ఇంటి పేరుగా మారిపోయింది. దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె అసాధారణ సినీ ప్రయాణంలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సుమారు 400లకు పైగా చిత్రాల్లో నటించి రికార్డు సృష్టించారు. కేవలం నాయికగానే కాకుండా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లోనూ వైవిధ్యం చాటుకుని తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. కళారంగానికి ఆమె అందించిన అమూల్యమైన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2022 సంవత్సరంలో దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' అవార్డుతో ఆమెను ఘనంగా సత్కరించింది. ఆమె మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులు అర్పిస్తున్నారు.

# మగబిడ్డ పుట్టాడు..
# 'కేరింత' హీరోయిన్ పోస్ట్ వైరల్



తెలుగులో 'కేరింత' అనే సినిమాలో హీరోయిన్‌గా చేసిన సుకృతి తల్లయింది. మగబిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ మేరకు ఓ ఫొటోని కూడా పోస్ట్ చేసింది. ఈ క్రమంలోనే పలువురు నెటిజన్లు ఈమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఢిల్లీకి చెందిన సుకృతి అంబటి.. చదువుకుంటున్న టైంలో డ్యాన్స్, యాక్టింగ్‌లోనూ ఆసక్తి చూపించేది. అలా దిల్ రాజు నిర్మించిన 'కేరింత'లో భావన పాత్ర కోసం ఎంపికైంది. ఈ మూవీ హిట్ అయినా సరే అవకాశాలు రాలేదో ఆసక్తి లేదో తెలియదు గానీ మరో మూవీ చేయలేదు. యాక్టింగ్ కెరీర్ పక్కనబెట్టేసింది. ఇక నాలుగేళ్ల క్రితం అక్షయ్ సింగ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. గత కొన్నాళ్లుగా ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తూ వచ్చిన సుకృతి.. ఈ ఏడాది ఏప్రిల్‌లో తను ప్రెగ్నెన్సీతో ఉన్న సంగతి బయటపెట్టింది. ఇప్పుడు తనకు మగబిడ్డ పుట్టాడని చెప్పుకొచ్చింది.

## బాలీవుడ్ ఎంట్రీపై భాగ్యశ్రీ బోర్సేకు షాక్..
## ఆ వార్తల్లో నిజం లేదంటూ క్లారిటీ!

టాలీవుడ్‌లో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన ఓ బాలీవుడ్ వార్త తాజాగా ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ స్టార్ హీరో ఆదిత్య రాయ్ కపూర్, దర్శకుడు మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ లవ్‌స్టోరీలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా ఎంపికైందంటూ గత కొద్దిరోజులుగా జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా బాలీవుడ్ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ స్పందించింది. ఈ ప్రచారాన్ని టీ-సిరీస్ ప్రతినిధులు అధికారికంగా ఖండించారు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోందన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. సినిమాలో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామని తెలిపారు. ఆదిత్య రాయ్ కపూర్, మిలాప్ జవేరీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రస్తుతం భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, యాక్షన్, ఎమోషన్స్ మేళవింపుతో ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు దర్శకుడు మిలాప్ జవేరీ గతంలో వెల్లడించారు. ప్రేమకథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపించిన మిలాప్ జవేరీ.. 'మర్జావాన్', 'ఏక్ దివానే కీ దివానియత్' వంటి సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి ఆదిత్య రాయ్ కపూర్‌తో మరింత ఇంటెన్స్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. భాగ్యశ్రీ బోర్సేకు బాలీవుడ్ కొత్తేమీ కాదు. 'యారియాన్ 2', 'చందు ఛాంపియన్' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమె.. హీరోయిన్‌గా మాత్రం ఇప్పటివరకు పెద్ద ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కించుకోలేదు. ఆదిత్య రాయ్ కపూర్ సినిమా ద్వారా బాలీవుడ్‌లో హీరోయిన్‌గా గ్రాండ్ ఎంట్రీ ఇస్తుందంటూ వచ్చిన వార్తలు కూడా ఇప్పుడు అవాస్తవంగా తేలాయి. భాగ్యశ్రీ బోర్సే రవితేజ నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌లోకి హీరోయిన్‌గా అడుగుపెట్టింది.






# బాక్సాఫీస్ వద్ద 'డీసీ' జోరు..
# రూ.100 కోట్ల క్లబ్‌లోకి
# లోకేష్ కనగరాజ్ సినిమా!

టాలెంటెడ్ డైరెక్టర్ అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో, ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డీసీ' (ఐజ) సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం, విడుదలైన మొదటి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంటూ దూసుకెళ్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే భారీ వసూళ్లతో ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తున్న ఈ చిత్రం తాజాగా రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరింది. దీంతో దర్శకుడిగా సత్తచాటిన లోకీ నటుడిగా కూడా తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. శరత్ చంద్ర చటోపాధ్యాయ క్లాసిక్ నవల 'దేవదాస్' స్ఫూర్తితో, అరుణ్ మాథేశ్వరన్ తనదైన మాస్ అండ్ రా యాక్షన్ శైలిలో తెరకెక్కించిన ఈ చిత్రం టాలీవుడ్ మరియు కోలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో దేవదాస్ పాత్రలో లోకేష్ కనగరాజ్ తన తొలి నటనతోనే విమర్శకుల ప్రశంసలు అందుకోగా, చంద్ర పాత్రలో వామికా గబ్బి మరియు మరో ప్రధాన పాత్రలో సంజనా కృష్ణమూర్తి నటన సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన ఉత్కంఠభరితమైన నేపథ్య సంగీతం, ముకేష్ జి సినిమాటోగ్రఫీ, ప్రసన్న జి.కె ఎడిటింగ్ ఈ సినిమా స్థాయిని విపరీతంగా పెంచేశాయి.

Edited Printed Published & Owned by DAMA VIJAYAKUMAR.And Printed at VSR Printers, # 1-176, Vakadu Village and post, Vakadu Mandal, Tirupati District, Pin : 524415, A.P.
Published at VSR Publications, H.No. 403, Panta Street, Chittoor, Andhra pradesh, Pin : 517501, EDITOR DAMA VIJAYAKUMAR, RNI. NO. APTEL/26/A2367